క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. యోగా చేయడం దినచర్యలో ఒక భాగంగా అలవర్చుకోవాలన్నారు. యోగతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, సిబ్బంది విజయలక్ష్మి, సుందరిరాణి, ప్రసాధరావు, గురయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలు



పైపులైన్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్

అరకులోయ రూరల్: పట్టణంలో పైపులైన్ మరమ్మతు పనుల వల్ల కొన్ని ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్ చెప్పారు. ఈ మేరకు సీ-కాలనీ, బి-కాలనీ, కొండవీధి తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పైపులైన్ మరమ్మతు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అందుబాటులో వరి విత్తనాలు

కొయ్యూరు: మండలంలో ఎనిమిది ఆర్‌బీకేల పరిధిలోకి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు ఏవో ఉమాదేవి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆర్‌జీఎల్-2537 రకం 194 క్వింటాళ్లు, ఎంటీయూ-1064 32 క్వింటాళ్లు, ఎంటీయు-1121 రకం 30 క్వింటాళ్లు, బీపీటీ-5204 రకం 68 క్వింటాళ్లు, ఆర్‌ఎన్‌ఆర్-15048 రకం 28 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. విత్తనాలు మొలక శాతం నిర్ధారణ అయిన వెంటనే వాటిని రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

'ఆణిముత్యాలు'కు పురస్కారాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో సర్పంచ్ ఆకేటి సీత

మోతుగూడెం: మోతుగూడెంలోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జగనన్న ఆణిముత్యాలు కింద పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలను పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ముగ్గురు విద్యార్థులకు ప్రభుత్వం తరఫున గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్‌ను సర్పంచ్ ఆకేటి సీత అందజేసి అభినందనలు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన తిరుమల ఐశ్వర్య, నీలా, కోర ప్రసాద్‌కు నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

టూరిజం ఉద్యోగి మృతికి సంతాపం



అప్పలనాయుడు(ఫైల్)

అరకులోయ రూరల్: మండల కేంద్రం సీ-కాలనీకు చెందిన కొర్రా అప్పలనాయుడు ఏపి టూరిజంలో హౌస్ కీపర్‌గా పనిచేస్తు న్నారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పెదలబుడు మాజీ సర్పంచ్ సమర్డి గులబి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి మృతుడి కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రత్యేక చొరవ తీసుకుని విశాఖ కేజీహెచ్ నుంచి మృతదేహాన్ని అరకులోయ సీ-కాలనీకి చేర్చారు. పలువురు అప్పలనాయుడు మృతికి సంతాపం తెలిపారు.

అద్దంలా దారులు...
తీరిన వెతలు

- శివారు గ్రామాల్లో మెరుగుపడిన రవాణా సౌకర్యాలు
- అందుబాటులో ప్రభుత్వ సేవలు
- రూ.11 కోట్లతో రహదారుల నిర్మాణం

మన్యంలోని అన్ని ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉండేవి.. గోతులమయమైన రోడ్లతో ప్రజలు నానా అవస్థలు పడేవారు. రోడ్లు లేక రవాణా సౌకర్యం కరువైంది. గత టీడీపీ హయాంలో రహదారుల కోసం గిరిజనులు పలుమార్లు పాలకులకు విన్నవించుకున్నా స్పందన కరువైంది. గిరిజనులు ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యంగా ఉండేది. అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకెళ్లి విక్రయించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు.. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవలందక గిరిజనులు పడిన అవస్థలు వర్ణనాతీతం. ఇదంతా గతం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి ఆశలు నెరవేరాయి. ప్రస్తుతం శివారు గ్రామాల్లోనూ నిర్మిస్తున్న రహదారులు అద్దంలా దర్శనమిస్తున్నాయి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయి.

పెదబయలు: మన్య ప్రాంతాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. అన్ని గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సదుపాయం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. శివారు గ్రామాలకు కూడా రవాణా సౌకర్యం మెరుగుపడుతోంది. మండలంలోని గోమంగి పంచాయతీలో గతంలో రోడ్డు సదుపాయం లేకపోవడంతో అమ్మో అనే పరిస్థితి ఉండేది... నేడు గోమంగి కేంద్రంగా ఉన్న జిల్లా కేంద్రం పాడేరుకు చేరవయ్యేలా చేపడుత్ను రహదారితో ఆహా అని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తీరిన రహదారి కష్టాలు

గోమంగి కేంద్రంగా రింగు రోడ్డు కాకుండానే పాడేరు జిల్లా కేంద్రం గుత్తులపుట్టు జంక్షన్ నుంచి పెదకోడాపల్లి, కిముడుపల్లి కలుపుకుంటూ వన్నాడ మీదుగా గోమంగి వరకు సుమారు రూ.7 కోట్ల నిధులతో తారురోడ్డు నిర్మాణం, అలాగే పెదబయలు మండల కేందం నుంచి కొత్తాపుట్టు జంక్షన్ నుంచి లక్ష్మీపేట పంచాయతీ మీదుగా గోమంగికి రూ.4 కోట్లతో తారురోడ్డు నిర్మాణం చేయడంతో గోమంగి పంచాయతీ కేంద్రంగా ఉన్న గుల్లేలు, లింగేటి, బొంగరం, ఇంజరి, గిన్నెటకోట, పోయిపల్లి ఏడు గ్రామ పంచాయతీలకు రవాణా కష్టాలు తీరింది. రోడ్డు సదుపాయంతో పాటుగా పాడేరు నుంచి బొంగరం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రతీ రోజు నడుపుతుండడంతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది.

పాడేరుకు మరింత చేరువ

పాడేరు నుంచి గుత్తులపుట్టు నుంచి పెదకోడాపల్లి, కిముడుపల్లి మీదుగా తారురోడ్డు నిర్మాణంతో జిల్లా కేంద్రం పాడేరు వెళ్లడానికి 30 కిలోమీటర్లు మేర దూరం తగ్గింది. గతంతో గోమంగి నుంచి వెళ్లాలంటే ముంచంగిపుట్టు మండలం మీదుగా పెదబయలు వెళ్లి పాడేరు వెల్లాల్సి వచ్చేది.అ లాగే గోమంగి నుంచి మద్దిగరువు, జి.మాడుగుల మీదుగా పాడేరు వెళ్లాల్సి వచ్చేది. నేడు 30 కిలోమీటర్లు దూరం తగ్గేలా వన్నాడ మీదుగా తారురోడ్డు నిర్మాణంతో జిల్లా కేంద్రానికి చేరువైంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఏజెన్సీలో రవాణా కష్టాలు తీర్చిన దాఖలాలు లేదు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడంతో తక్కువ కాలంలో గిరిజనులకు ఎక్కువ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి.



వన్నాడ మీదుగా పాడేరు వెళ్లే తారు రోడ్డు

పంచాయతీలోని కరుగొండ మీదుగా బొడ్డాపుట్టు వరకు, అరడగూడెం ఘాటీ నుంచి వంకరాయి మీదుగా పంగళం వరకు తారురోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్లు పూర్తయితే పంచాయతీలో అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో రోడ్డు సదుపాయం కలుగుతోంది.

సకాలంలో వైద్య సేవలు

జిల్లా మండల కేంద్రాలకు వెళ్లడానికి తారురోడ్లు నిర్మాణం చేయడంతో ప్రజలకు సకాలంలో వైద్య సేవలందుతోంది. 108, 104, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు మరింత చేరువయ్యింది. గోమంగి పీహెచ్‌సీలో అత్యవసర కేసులు వస్తే పెదబయలు కాకుండా నేరుగా జిల్లా కేంద్రంలోని పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు. గతంలో అత్యవసర కేసులైనా పెదబయలు వెళ్లిన తరువాతే పాడేరు తరలించే అవకాశం ఉండేదని పలువురు చెబుతున్నారు. గతంలో సెల్ సిగ్నల్ కోసం సుమారు 5 కిలోమీటర్లు పైబడి సిగ్నల్ పాయింగ్‌కు వచ్చి ఫోన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని గోమంగి వాసులు చెబుతున్నారు. నేడు సెల్ టవర్ల నిర్మాణంతో సాంకేతిక సేవలు మెరుగుపడ్డాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మీపేట మీదుగా గోమంగి రోడ్డు

రవాణా మెరుగు

వన్నాడ కలుపుతో కిముడుపల్లి, మీదుగా పాడేరు తారురోడ్డు నిర్మాణంతో పెదబయలు మండల కేంద్రానికి కంటే జిల్లా కేంద్రం గోమంగి చేరువైంది. అలాగే లక్ష్మీపేట నుంచి గోమంగి వరకు తారురోడ్డు ఎంతో ఉపయోగం అత్యవసర సేవలకు మరింత ఉపయోగపడుతోంది. మండలంలో పెద్దఎత్తున తారు రోడ్ల నిర్మాణం జరుగుతోంది.

– సంతోష్ , ఏఈ, పీఆర్ ప్రాజెక్టు, పెదబయలు

అన్ని గ్రామాలకు రహదారులు



సీఎం జగన్‌మోహన్ రెడ్డి గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి ఫలితమే నేడు గ్రామాలకు పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం జరుగుతోంది. పెదబయలు మండలంలో కరోనా కాలంలోనూ రోడ్ల నిర్మాణం చేపట్టాం. పెదబయలు మండలంలోనే 32 తారురోడ్ల నిర్మాణం జరిగింది. ఇంకా అన్ని గ్రామాలకు రోడ్లు కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గతంలో గోమంగి అంటే మారుమూల.. ఇప్పుడు రోడ్డు ఏర్పాటుతో జిల్లా కేంద్రం పాడేరుకు అరగంటలో వెళ్లే పరిస్థితి ఉంది. అన్ని గ్రామాలకు రహదారుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం

– చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యే, అరకు నియోజకవర్గం

అమ్మవారికి ప్రత్యేక పూజలు



వన దుర్గ దేవత అలంకరణలో అమ్మవారు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో వేంచేసిన గిరి దుర్గా భవానీ అమ్మవారికి వన దుర్గా దేవతగా అలంకరించి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య మాట్లాడుతూ లోక కల్యాణార్థం ప్రజలు సుఖ సంతోషాలను కాంక్షిస్తూ అమ్మవారికి పూజలు చేసినట్టు తెలిపారు. అమ్మవారి విగ్రహంతో పాటు గర్భాలయం అంతటా వేప కొమ్మలను ఉంచి అర్చనలు చేసినట్టు పేర్కొన్నారు. జిల్లాలోని పోతవరం గ్రామ గిరిజనులకు పవనగిరి క్షేత్రం తరఫున అభయాంజనేయ స్వామి వారి విగ్రహాన్ని వితరణకు సిద్ధం చేసినట్టు ఆయన చెప్పారు. గురుపౌర్ణమి సందర్భంగా జులై మూడున విగ్రహానికి ప్రత్యేక పూజలు అనంతరం ఆయా గ్రామస్తులకు అందజేస్తామన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

విత్తన శుద్ధిపై అవగాహన

మునగపాక: విత్తనశుద్ధిపై రైతులు అవగాహన పెంచుకోవాలని అనకాపల్లి జిల్లా రీసోర్స్‌సెంటర్ రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి తులసి తెలిపారు. మండలంలోని తోటాడ ఆర్బీకేలో శుక్రవారం రైతులకు విత్తనశుద్ధి, వేసవి దుక్కులు, నారుమడుల తయారీ తదితర విషయాలపై అవగాహన కల్పించారు.మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మి,వీవోఏ భవాని,రైతులు ఆదినారాయణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

అరకులోయ రూరల్: కొత్తభల్లుగూడ పంచాయతీ సార్నాయిగూడఇటీవల వర్షాలకు నాలుగు ఇళ్లు ధ్వంసమైన సంగతి తెలిసిందే. ఈ సంఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో సర్పంచ్ కొర్రా రాధిక, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్, స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాలకు ఇళ్ల నిర్మాణాల కోసం రూ.50వేల విలువ చేసే పైకప్పు రేకులు అందజేశారు. దీంతో బాధిత కుటుంబీకులు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, ఎంపీటీసీ సభ్యులు శత్రుగున్, రామ్మూర్తి, నాయకులు తిరుపతి, సన్యాసి,శెట్టి గోపాల్, నర్సింగ్, సోమేష్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



సిమెంటు రేకులు అందజేస్తున్న సర్పంచ్ రాధిక, నాయకులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చింతపల్లి: మండలంలోని పెదబరడ పంచాయితీ తెరపల్లికి చెందిన గిరిజనుడు ఇటీవల ప్రమాదవశాత్తు పనస చెట్టు నుంచి జారిపడి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. తెరపల్లికి చెందిన తాడే జాన్‌బాబు ఇటీవల పనసపండు కోస్తుండగా చెట్టు నుంచి జారిపడి తీవ్రగాయాలై, విశాఖపట్నం కెజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న అల్లూరి యువ గిరిజన సేవా సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థల సభ్యుల ఆర్థిక సాయం చేశారు. సంఘం సభ్యులు మల్లేసు, సన్యాసిరావు, సింహాచలం, ఈశ్వర్‌బాబు, పెదబరడ సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

పశువ్యాధులపై అప్రమత్తం

హుకుంపేట: పశువులకు వ్యాధులు సోకకుండా పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని హుకుంపేట పశువైద్యాధికారి డాక్టర్ చరణ్ అన్నారు. మండలంలోని బొడ్డాపుట్టు, అడ్డుమండ, ఉర్రాడా, అల్లంపుట్టు, దిగుడుపుట్టు, చింతకోట, గొచ్చరి, నక్కలపుట్టు, శోభకోట, ముల్యాపుట్టు తదితర గ్రామాల్లో శుక్రవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామల్లో 1472 మూగజీవులకు నట్టల నివారణ మందులు వేసినట్టు డాక్టర్ చరణ్ తెలిపారు. పాడిరైతులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పశు వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులకు ఎటువంటి వ్యాధి లక్షణాలు ఉన్నా సరే తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి చరణ్, తదితరులు

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన



మర్రిపాలెంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ఎంపీపీ, సర్పంచ్‌లు



రచ్చపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు లక్ష్మి, సత్యవతి

అనంతగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పూర్వ ప్రాథమిక విద్యతో చిన్నారులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మిలావణ్య, శాంతి ప్రియ, నిర్మల అన్నారు. అనంతగిరి సెక్టార్ పరిధిలో జన భాగీ దారి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నారుల తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీప్రైమరీ విద్యపై అవగాహన కల్పించారు. సిబ్బంది లక్ష్మి, సుమిత్ర, సరస్వతీ, చిలకమ్మ, చిట్టెమ్మ, కాంత పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సింగర్భ సెక్టార్‌లోని రచ్చపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జన్ భగీదరి కార్యక్రమం జరిగింది. ప్రీప్రైమరీ స్కూల్ పిల్లలు, తల్లులు అంగ్‌వాడీలతో జన్ భగీదరిపై సింగర్భ, వంతాల సూపర్‌వైజర్లు ఎస్.లక్ష్మి, ఎస్.సత్యవతిలు అవగాహన కల్పించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: అంగన్‌వాడీ విద్యకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఎంపీపీ వల్లాల కృష్ణారెడ్డి అన్నారు. మర్రిపాలెం సచివాలయంలో అంగన్‌వాడీ ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలకు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మర్రిపాలెం సచివాలయం పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్‌లో అభ్యసించిన 70 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను ఆయన అందజేశారు. సర్పంచ్‌లు వెంకటేశ్వర్లుదొర, రామలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌గా సలోమి



ప్రిన్సిపాల్ సలోమి

రాజవొమ్మంగి: మండలకేంద్రంలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా లంకపల్లి సలోమి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఆమె శ్రీశైలం (నంద్యాల జిల్లా) స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్సీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. మూడున్నర దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన ఈ కళాశాలలో గతంలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేశానని, ఇప్పుడు ప్రిన్స్‌పాల్‌గా రావడం ఆనందంగా ఉందని సలోమి చెప్పారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆర్.వి.మోహనరావు మారేడుమిల్లి బాలుర గురుకుల కళాశాలకు బదిలీ అయ్యారు.

ఎర్రంపాడులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఉషాశ్రీ

రాజవొమ్మంగి: మండలంలోని ఎర్రంపాడు గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషాశ్రీ 29 మంది రోగులను పరీక్షించి అవసరమైన చికిత్స, మందులు అందజేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాల చిన్నారులను హెల్త్ సెంటరుకు తీసుకొని వచ్చి వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేశారు. ఆరోగ్యసూత్రాలను వివరించారు. 104 సిబ్బందితో పాటు రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ కో-ఆర్డినేటర్లకు సన్మానం



కో-ఆర్డినేటర్లకు మెరిట్ పత్రాలు అందజేస్తున్న పాస్టర్ సంజీవ్‌కుమార్, జోనతన్

అరకులోయ: బెంజిపూర్‌లోని పరిశుద్ధ మేరీ లూథరన్ దేవాలయంలో రన్ ఫర్ జీసస్ కో-ఆర్డినేటర్లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆరాధన టీవీ ప్రతినిధి జోనతన్, లూథరన్ మిషన్ దేవాలయాల డైరెక్టర్, పాస్టర్ రెవరెండ్ సంజీవ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కో-ఆర్డినేటర్లకు మెరిట్ పత్రాలతో పాటు బహుమతులు అందజేసి సత్కరించారు. పాస్టర్లు సదానందం, మదన్, దావీదు, దాసుబాబు, మోహన్, దొర, విజయ్‌కుమార్, కొండలరావు, నగేష్, ఆసేరు, మూర్తిపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని ఇక్కట్లు



కళాశాలలో పాడైన మినరల్‌వాటర్ ప్లాంట్

రాజవొమ్మంగి: మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో తాగునీరు నీటికి ఇబ్బంది ఏర్పడింది. మంచినీటి బోరు మోటారు కాలిపోవడంతో పాటు, పైపులైన్ దెబ్బతినడంతో నీరు సరఫరా కావడం లేదని ప్రిన్సిపాల్ సలోమి చెప్పారు. సమస్యను పరిష్కరించాలని ఆమె అధికారులను కోరారు. కళాశాలకు చెందిన మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని, బాగు చేయాలని ఆమె కోరారు.

ప్రభుత్వ విద్యకు పెద్దపీట



దుంబ్రిగుడలో విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో రామచంద్రరావు



చింతూరులో జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న వైస్ ఎంపీపీ సుధాకర్

దుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ గేదెలబంద గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో రామచంద్రరావు శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రోజూ పాఠశాలకు పంపించాలని ఆయన కోరారు. జేవీకే కిట్లను సక్రమంగా పంపిణీ చేయాలని, నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. హెచ్‌ఎం రజిత, విద్యా కమిటీ చైర్మన్ రాజాకుమార్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపేదల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాల విద్యలో పెనుమార్పులు తీసుకొచ్చారన్నారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మారాయని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతోందని, తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా అమ్మఒడి తదితర పథకాలను అమలుచేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆయన సూచించారు. విద్యా కమిటీ చైర్మన్ ఎండీ జిక్రియా, హెచ్‌ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని మర్రిపాలెం పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు.వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిడతమామిడి, సూరంపాలెం, జగ్గంపాలెం, ఎండపల్లి, మొల్లేరు, మర్రిపాలెం సర్పంచ్‌లు నేషం మరిడమ్మ, బల్లెం శివ , తుర్రం లీలావతి, రామలక్ష్మి, కుంజంలక్ష్మి , వెంకటేశ్వర్లు , యూటీఎఫ్ జిల్లా నాయకులు కె.కృష్ణ, హెచ్‌ఎంలు సాయిబాబా, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాలెం జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

రామకృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



సజ్జల రామకృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరులోని ఆయన నివాసంలో కలిసి సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే తనయులు వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, చెట్టి వికాస్, నాయకులు ఉన్నారు.

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో రాజారమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కో-అప్షన్ సభ్యుడు రహంతుల్లా, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపిటీసీ సభ్యుడు భీమరాజు, సర్పంచ్ నాగేశ్వరరావు, నాయకులు ముఖీ సాంబ, రామ్మూర్తి, అర్జున్, సోమేష్, అప్పలస్వామి, గోపాల్, గురుమూర్తి, నర్సింగ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.